క్లుప్తంగా

భూముల రీసర్వేను వేగవంతం చేయండి



సమావేశానికి హాజరైన టౌన్ ప్లానింగ్ అధికారులు, వార్డు సచివాలయాల కార్యదర్శులు

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని భూములకు సంబంధించి, రీసర్వేను వేగవంతం చేయాలని మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎంవీ నాగరాజు సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్, వార్డు సచివాలయ కార్యదర్శులతో సమావేశమైన ఆయన మూడు రోజుల్లో సర్వే పూర్తిచేసి, వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సర్వేలో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఆర్ఐ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

రూ.3 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం



గోరువీధిలో కొత్తగా వేసిన సీసీ రోడ్డు

రాజాం: మండలంలోని కంచరాం గ్రామంలో గోరు వీధిలో రూ.3 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మించారు. గతంలో ఇదే వీధిలో సీసీ రోడ్డు, మురుగుకాలువ లేకపోవడంతో ప్రజల వాడుక నీరు, వర్షపునీరు రోడ్డు మీదకు వచ్చి, బురదగా ఉండేదని, ఆ దారిలో నడిచేందుకు ఇబ్బంది పడేవారమని గ్రామస్తులు తెలిపారు. ఈ సమస్యను ఎమ్మెల్యే కంబాల జోగులు దృష్టికి తీసుకువెళ్లగా, ఆయన చొరవతో మండల పరిషత్ నిధులు మంజూరయ్యాయని, వీటితో రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు సర్పంచ్ గెడ్డాపు సుబ్బమ్మ, సచివాలయ కన్వీనర్ గెడ్డాపు అప్పలనాయుడు వెల్లడించారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలు అందిస్తున్న ఏఓ మురళీకృష్ణ

రేగిడి: మండలంలోని చాటాయివలస, లక్ష్మీపురం, రేగిడి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను మంగళవారం పంపిణీ చేశారు. 50 శాతం రాయితీపై కట్టిజనుము, జీలుగు, పిల్లిపెసర వంటి విత్తనాలను అన్నదాతలకు అందిస్తున్నామని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ అన్నారు. వేసవి దుక్కుల తర్వాత వీటిని పొలాల్లో వేసుకుని, పంట చేతికి వచ్చే సమయంలో మళ్లీ దుక్కి చేస్తే నేల సారవంతమై, పంటలు బాగా పండుతాయన్నారు.

యుద్ధప్రాతిపదికన పైపులైన్ ఏర్పాటు పనులు



పోతురాజుపేటలో జరుగుతున్న పైపులైన్ ఏర్పాటు పనులు

సంతకవిటి: మండలంలోని పోతురాజుపేట గ్రామంలో తాగునీటి పైపులైన్ ఏర్పాటు పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. మండల పరిషత్ నిధుల నుంచి మంజూరైన దాదాపు రూ.2 లక్షల నిధులతో బోరు, పైపులైన్‌లను మంగళవారం ఏర్పాటు చేసి, కుళాయిల ద్వారా తాగునీరు అందించారు. వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ బత్తుల జ్యోతీశ్వరరావు తెలిపారు.

బైటోభజన కళాకారులకు సన్మానం

రాజాం: భక్తయోగ భజన ముగింపు కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని సారధి గ్రామంలో వంజరాంపేట, కాగితాపల్లి, పనసలవలస గ్రామాలకు చెందిన బైటోభజన కళాకారులను మంగళవారం సన్మానించారు. గ్రామానికి చెందిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు వారాడ వంశీకృష్ణ మాట్లాడుతూ బైటో భజనలు ముక్తికి మార్గాలని ఆ భజనల గొప్పతనం వివరించారు.

పేదరిక నిర్మూలనే సీఎం జగన్ లక్ష్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యేలు కంబాల జోగులు, శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



వంగర: వృద్ధురాలికి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జోగులు

వంగర: రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మంగళవారం మండలంలోని కొండచాకరాపల్లి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, కోవిడ్ కష్టకాలంలో కూడా ఏ ఒక్క పథకం అమలు ఆగలేదన్నారు. ప్రస్తుతం అమలులోని పథకాలతో ప్రతిఇంటా సంక్షేమ వెలుగులు నెలకొన్నాయన్నారు. ప్రతీ పేదవాడు సంతోషంగా ఉండాలన్నదే సీఎం జగనన్న అభిమతమని, ఎంతోమందికి ఇళ్లు, పథకాలు మంజూరు చేశారని పేర్కొన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో అభివృద్ధి పనులు కూడా చాలా చురుగ్గా నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలతో దుష్ప్రచారం చేస్తున్నారని అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ యు.సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కె.సుదర్శనరావు, సర్పంచ్ గొయ్యమ్మ, ఎంపీటీసీ కె.సన్యాసినాయుడు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతిఇంటా 'సంక్షేమ' సంతోషం



రామభద్రపురం: ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలతో ప్రతి ఇంటా సంక్షేమ సంతోషం నెలకొందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని పాండూరు, కర్లి వీధుల్లో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యేకు ఆయా ప్రాంతాల ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ఎన్నికల మేనిఫెస్టోలోని 98 శాతానికి పైగా హామీలు నెరవేర్చిన ఘనత ఒక్క వైఎస్సార్ సీపీకే దక్కిందన్నారు. సచివాలయ వ్యవస్థతో ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకు సంక్షేమ పథకాలను సీఎం జగనన్న చేరవేస్తున్నారన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకనే ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలెవరూ నమ్మడం లేదన్నారు. ఒక్క సీఎం జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యమని, ఇవే పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. మరోసారి సీఎం జగన్‌ను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, పార్టీ నాయకులు డి.షైడిరాజు, ఎం.శ్రీనివాసరావు, ఎం.కాంతారావు తహసీల్దార్ రాజారావు, ఎంపీడీఓ రమామణి తదితరులు పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ప్రారంభించిన ఎంపీ



బస్‌షెల్టర్ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎంపీ బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: మండలంలోని జన్నివలస వద్ద కొత్తగా నిర్మించిన బస్‌షెల్టర్‌ను ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడుతో కలిసి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నారని, దీంతో రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ఓ వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమం అమలు చేసి, చూపిస్తున్నారని ప్రశంసించారు. మనబడి నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలలు, ఆస్పత్రులను ఆధునీకరించడం జరిగిందన్నారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను ఎంపీ కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు సరస్వతి, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, జన్నివలస, కొట్టక్కి సర్పంచ్‌లు జె.సారంగదొర, ఎ.అనకురాధ, ఎంపీటీసీ రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు



ఉంగరాడమెట్ట అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న అసిస్టెంట్ సీడీపీఓ శిమ్మాలమ్మ

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట, ఉంగరాడ ప్రాంతాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను అసిస్టెంట్ సీడీపీఓ శిమ్మాలమ్మ మంగళవారం సందర్శించి, ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం అమలు, ప్రీస్కూల్ చిన్నారుల హాజరు, వారి విద్యాభ్యాసానికి సంబంధించి, ప్రభుత్వం సరఫరా చేసిన కిట్లు, రికార్డులను ఆమె పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. చిన్నారుల బరువు ఎప్పటికప్పుడు తూకం వేసి, వివరాలు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నూకాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా గ్రావెల్ రోడ్డు నిర్మాణం



లక్ష్మీపురంలో వేస్తున్న గ్రావెల్ రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్ వెంకటేశ్వరరావు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో బీసీ కాలనీ, మెయిన్ వీధి, పాఠశాల వద్ద గ్రావెల్ రోడ్ల నిర్మాణం చాలా చురుగ్గా జరుగుతోంది. సర్పంచ్ కెంబూరు వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మాణాలు చేపడుతున్నారు. దీంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నేడు ద్విచక్ర వాహనం వేలం

వంగర: అక్రమంగా మద్యం తరలించేందుకు వినియోగించిన ద్విచక్ర వాహనాన్ని రాజాం ఎస్ఈబీ కార్యాలయంలో బుధవారం వేలం వేయనున్నట్లు ఎస్ఐ జనార్దన తెలిపారు. ఆసక్తి ఉన్న వారంతా వేలంపాటలో పాల్గొని, వాహనాన్ని సొంతం చేసుకోవాలని కోరారు.

ఆటపాటలతో కూడిన విద్యనందించాలి



సూచనలిస్తున్న ఐసీడీఎస్ బాడంగి పీఓ రాజ్యలక్ష్మి

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న ప్రీస్కూల్ పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని ఐసీడీఎస్ బాడంగి పీఓ కె.రాజ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో జన భాగీదారీ కార్యక్రమం మంగళవారం నిర్వహించగా, జన్నివలస కేంద్రంలో చేపట్టిన కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు.

అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో ఫోర్ డెవలప్‌మెంట్ కార్నర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులను, కుటుంబ సభ్యులను కేంద్రాలకు ఆహ్వానించాలని, ప్రీస్కూల్‌లో నిర్వహించే కార్యక్రమాలు పిల్లల సమగ్రాభివృద్ధికి ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో వివరించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం తప్పనిసరిగా అందివ్వాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మి, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిర్దేశిత కొలతల్లో పనిచేస్తే గిట్టుబాటు వేతనం



ఉపాధి హామీ పనుల్లో వేతనదారులు

రాజాం: నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే గిట్టుబాటు అయ్యే వేతనం లభిస్తుందని ఉపాధి హామీ పనుల వేతనదారులకు ఎంపీడీఓ బాసూరి శంకరరావు, ఏపీఓ సాయిరాం సూచించారు. మంగళవారం మండలంలోని ఒమ్మి, ఆగూరు, వీఆర్ అగ్రహారం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించిన వారు వేతనదారులకు పలు సూచనలు చేశారు. వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో చల్లగా ఉన్న సమయంలో రెండు పూటలా పనిచేయాలని తెలిపారు. అర్హులైన వారందరికీ జాబ్‌కార్డు మంజూరు చేయాలని, జాబ్‌కార్డు ఉన్న ప్రతీ వ్యక్తికి పని కల్పించాలన్నారు. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్ ఉండేలా చూడాలన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రైతులకు విత్తనాలు అందిస్తున్న సర్పంచ్ చిన్నంనాయుడు

రాజాం: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అంతకాపల్లి సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని అంతకాపల్లి గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ముందుగా విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకున్న వారికి వీటిని అందజేసినట్లు ఆయన తెలిపారు. బీపీటీ–3291 రకం వరి విత్తనాలు 30 కిలోలను రాయితీ పోను రూ.819కు, ఎంటీయూ–1224 రకం విత్తనాలు 30 కిలోలను రాయితీ పోను రూ.819కు, ఆర్‌జీఎల్–2537 రకం వరి విత్తనాలు రాయితీ పోను రూ.834కు, ఎంటీయూ–7029, ఎంటీయూ–1064, ఎంటీయూ–1061 రకం వరి విత్తనాలు రాయితీ పోను 30 కిలోలను రూ.843కు, ఎంటీయూ–1121 రకం వరి విత్తనాలు 30 కిలోలను రాయితీ పోను రూ.834కు, ఎంటీయూ–1318 రకం వరి విత్తనాలు రాయితీ పోను 30 కిలోలను రూ.843కు, బీపీటీ 5204 రకం వరి విత్తనాలను రాయితీ పోను 25 కిలోలను రూ.698కు అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో వీఏఏ కె.నవ్య, వీఆర్ఓ జి.అనంతరావు, పంచాయతీ కార్యదర్శి జి.అప్పలనాయుడు, ఎంపీటీసీ బి.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



అలరించిన బిందెల డ్యాన్స్



ఆకట్టుకున్న వేషధారణ

బొబ్బిలి:

పట్టణ పరిధిలోని తారకరామా కాలనీలో జరుగుతున్న సరేపోలమ్మ, దేశతల్లి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా అమ్మవార్ల వేషధారణలు, బిందెల డ్యాన్స్, యువకుల నృత్యం, జబర్దస్త్ బృందం చేసిన ప్రదర్శనలు అలరించాయి. అంతకుముందు కౌన్సిలర్ వాడపల్లి వనజామనోజ్‌కుమార్ ఆధ్వర్యంలో అమ్మవార్ల ఘటాల ఊరేగింపు జరిగింది. ఈ క్రమంలో మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, యోగా గురువులు

బొబ్బిలి: ప్రతిరోజూ యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా గురువు ప్రసాద్ అన్నారు. ఈ నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని, స్థానిక శ్రీ యోగా సెంటర్‌లో దినోత్సవానికి సంబంధించి, రూపొందించిన కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఆరోజు యోగాసనాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్న వారంతా తప్పకుండా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్.ఎస్.ఎస్ జిల్లా సంఘ్ చాలక్ పి.స్వామినాయుడు, యోగా గురువు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోండి



ఉనుకూరులో భవన నిర్మాణ కార్మికుల ర్యాలీ

రేగిడి: భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండలంలోని ఉనుకూరు గ్రామంలో భవన నిర్మాణ కార్మికులతో ర్యాలీ చేపట్టిన ఆయన పెండింగ్‌లోని సంక్షేమ బోర్డు నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన కార్మికులందరికీ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.త్రినాద్, రవిశంకర్, తిరుపతిరావు, రాము, రవి, తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం పెద్దపీట



రేగిడి: అంబఖండిలో విద్యార్థులకు జేవీకే కిట్ల పంపిణీ

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యాకానుక(జేవీకే) కిట్ల పంపిణీ మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రజాప్రతినిధులు, అధికారుల చేతులమీదుగా వీటిని విద్యార్థులకు అందజేశారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్యనందించాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వక్తలు తెలిపారు. ఇప్పటికే మనబడి నాడు–నేడు పథకం కింద కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించి, మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. ఏటా జేవీకే పథకం ద్వారా రూ.2,500 విలువైన కిట్(ఓ స్కూల్ బ్యాగు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, 3 జతల యూనిఫాం, బూట్లు, రెండు జతల సాక్సులు)ను విద్యార్థులకు అందించడం జరుగుతోందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్



వంగర: ఎం.సీతారాంపురం విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం: పెనుబాకలో విద్యార్థులకు జేవీకే కిట్లు అందిస్తున్న జెడ్పీటీసీ నర్సింహులు



రాజాం సిటీ: దోలపేట స్కూల్ విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేస్తున్న హెచ్ఎం మురళి



తెర్లాం: చుక్కవలసలో జేవీకే కిట్లు అందజేస్తున్న ఎంఈఓ త్రినాధరావు



వంగర జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ పద్మ